ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

5

సోమవారం 16 డిసెంబరు 2024



అంతరాలయ పైభాగం

చిన వెంకన్న అంతరాలయం

స్వర్ణశోభితం



బంగారు కాంతులతో శోభిల్లుతున్న గర్భాలయం



స్వర్ణకాంతులతో శ్రీవారి ఆలయ ముఖద్వారం



అంతరాలయంలో శ్రీవారి కళ్యాణఘట్టం తెలిపే శిల్పకళ

- దాతల సాయంతో అంతరాలయం, ముఖద్వారం స్వర్ణమయం
- రూ.1.64 కోట్లు ఖర్చు చేసిన కృష్ణా జిల్లాకు చెందిన సంస్థ
- 265 గ్రాముల బంగారం, 148 కేజీల రాగి రేకులు అందించిన జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి గర్భాలయం పసిడి కాంతులతో శోభిల్లుతోంది. ధగధగలాడుతూ దేదీప్యమానంగా వెలుగొందుతున్న బంగారు వాకిలి నుంచి చిన వెంకన్న దివ్య మంగళస్వరూపాన్ని వీక్షిస్తున్న భక్తులు తన్మయత్వం పొందుతున్నారు. గోవిందా.. గోవిందా.. అంటూ పరవశిస్తున్నారు. నిత్యం వేలాది భక్తులతో కళకళలాడే శ్రీవారి ఆలయం శని, ఆదివారాల్లో మరింత రద్దీగా ఉంటుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా దాతలు సైతం స్పందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. శ్రీవారికి బంగారు వాకిలి ఏర్పాటు చేసేందుకు పలువురు దాతలు ముందు కొచ్చారు. 2021లో జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ సుమారు 265 గ్రాముల బంగారం, 148 కేజీల రాగి రేకులతో ఆలయ ప్రధాన ముఖద్వారానికి, తలుపులు, అంతరాలయ ద్వారానికి బంగారు తాపడం చేయించారు. తరువాత అంతరాలయాన్ని స్వర్ణశోభితం చేయడానికి కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు కలసి రూ.1.64 కోట్లు ఖర్చు చేశారు. శ్రీవారి గర్భగుడి బంగారు రేకులతో శిల్పకళ ఉట్టిపడేలా తయారుచేయించారు. బంగారు వాకిలిని ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు అక్టోబరు 4న ప్రారంభించారు. స్వర్ణశోభిత బంగారువాకిలి భక్తులకు కనువిందు చేస్తోంది. శ్రీవారి ఆలయ విమాన గోపురం కూడా స్వర్ణమయం చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

- ద్వారకాతిరుమల

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్‌ను) రద్దుచేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పర్యటన సందర్భంగా జిల్లా అధికారులంతా హాజరు కావాల్సి ఉన్నందున ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దుచేసినట్లు తెలిపారు.



సేవ్ ద గర్ల్..

పాలకొల్లులో ఉత్సాహంగా 2కే రన్

7



సంక్రాంతి సెలవులపై పునరాలోచన చేయాలి

ఎమ్మెల్సీ గోపీమూర్తి



గోదావరిలో కలిసిపోయిన డంపింగ్ యార్డు

- చెత్త డంపింగ్‌పై పిటిషన్
- నరసాపురంలో పొల్యూషన్ బోర్డు తనిఖీలు
- వచ్చే నెల 7న గ్రీన్ ట్రిబ్యునల్‌కు రిపోర్టులు
- తీర్పుపై అధికారుల్లో ఆందోళన
- భారీ పెనాల్టీ విధించవచ్చని ఊహాగానాలు
- యార్డు తరలింపుపై అధికారుల కసరత్తు


డంపింగ్ టెన్షన్

నరసాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి ఒడ్డున పురపాలక సంఘం నిర్వహిస్తున్న డపింగ్‌యార్డుపై ఢిల్లీలోని గ్రీన్ ట్రిబ్యునల్‌కు దాఖలైన పిటీషన్ ఇప్పుడు అధికారుల్లో టెన్షన్‌ను రేపుతున్నది. 30ఏళ్లగా నిర్వహిస్తున్న ఈ డపింగ్‌యార్డు వల్ల నది జలాలతో పాటు పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయని పట్టణానికి చెందిన ఓసూరి ఫణికర్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీన్ని న్యాయమూర్తులు సీరియస్‌గా పరిగణించి తక్షణం విచారణ నిర్వహించాలని ఆదేశించారు. దానికి అనుగుణంగా చెన్నై కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డుకు చెందిన ఈఈ కేవీరావు, రాష్ట్ర కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ అధికారి శాస్త్రి, పర్యావరణ శాస్త్రవేత్తలు సౌమ్య, సుకృతలు రెండు రోజుల పాటు గోదావరి తీరంలో పర్యటించారు. గాలి, మట్టి, నీరుల్లో కాలుష్య పరిశీలనకు 54 శాంపిల్స్ తీశారు. వీటి నివేదికలను వచ్చే నెల 7న గ్రీన్‌ట్రిబ్యునల్‌కు అందించనున్నారు. పరీక్షల్లో వచ్చిన రిపోర్టును స్థానిక అధికారులకు కూడా వెల్లడించలేదు. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్‌కు వీరు అందించే నివేదికపై మునిసిపల్ అధికారుల్లో ఆందోళన మొదలైంది. గతంలో ట్రిబ్యునల్ న్యాయమూర్తులు కాలుష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రిపోర్టుల ఆధారంగా తీర్పు ఎలా ఉంటుందోనన్న భయం వెంటాడుతున్నది. అయితే రిపోర్టుల్లో ఏమాత్రం తీవ్రత ఉంటే ఈసారి ట్రిబ్యునల్ సీరియస్‌గా పరిగణించి మునిసిపాలిటీకి భారీ పెనాల్టీ విధించవచ్చునన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. లేని పక్షంలో తక్షణం నది ఒడ్డున ఉన్న డపింగ్ యార్డును ఖాళీ చేయిస్తూ తీర్పును చెప్పవచ్చన్న వాదనలు లేకపోలేదు. ఈ రకమైన తీర్పు వస్తే డపింగ్‌యార్డును ఎక్కడికి తరలించాలన్న దానిపై మునిసిపల్ అధికారులు ఇప్పటి నుంచే తర్జనభర్జన పడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు కూడా దృష్టి పెట్టారు. ఉన్నతాధికారులు ఆర్డీవో దాసిరాజుతో ఈ విషయంపై సమీక్షిస్తున్నారు.

డంపింగ్ యార్డు తరలింపు ఎక్కడికి?

అధికారులు డపింగ్‌యార్డును తాత్కాలికంగా ఎక్కడ నిర్వహిస్తే బాగుంటుందన్న దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ప్రస్తుతం డపింగ్ యార్డులో సుమారు 50వేల టన్నుల చెత్త ఉంది. దీన్ని రీసెక్లింగ్ చేస్తున్నారు. సుమారు రూ.3.50 కోట్లతో చేపడుతున్న ఈ పని పూర్తికావడానికి ఇంకా ఎనిమిది నెలలు సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఉన్న చెత్తను అక్కడే ఉంచి రోజువారీగా సేక రిస్తున్న చెత్తను మరో ప్రదేశంలో వేయాలని అధికారులు భావిస్తున్నారు. దాన్ని తాత్కాలి కంగా నిర్వహించాలంటే కనీసం రెండు ఎకరాల స్థలమైన ఉండాలి. పట్టణ పరిధిలో ఎక్కడ పురపాలక సంఘానికి ఇంత పెద్ద స్థలం లేదు. ఇటు పరిశీలనకు వచ్చిన బృం దం అధికారులు డపింగ్‌యార్డుపై స్థానిక మునిసిపల్ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. చెత్తను తడి, పొడిగా సేకరించాలని, గోదావరి పరీవాహక ప్రాంతానికి 100 మీ టర్ల దూరంలో మాత్రమే చెత్తను వేయాలని ఆదేశించారు. దీంతో ఇంత దూరంలో ఏ స్థలం ఖాళీగా ఉందన్న దానిపై అధికారులు దృష్టి పెట్టారు.

కష్టాలు తీరేనా!





- నేడు సీఎం పర్యటన

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వాసితుల పాట్లు.. సీఎం చంద్రబాబుపై ఆశలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం వందల కుటుంబాలు అనేక పాట్లు పడ్డాయి. పుట్టి పెరిగిన గ్రామంతో తెగతెంపులు చేసుకుని పిల్లాపాపలతో పునరావాస కాలనీలకు తరలి వెళ్లేందుకు సిద్ధపడ్డాయి. తమకు అధికారంగా ప్రకటించిన పరిహారం అందేలా చూడాలని పదేపదే ప్రాధేయపడ్డాయి. గడచిన రెండు దశాబ్దాల కాలంలో పోలవరం నిర్వాసిత కుటుంబాల పాట్లు అన్నీ ఇన్నీ కావు. గడిచిన ఐదేళ్లు జగన్ నిర్వాకంతో ఈ కష్టాలు మరింత ముదిరాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు పట్టుదలతో ఉండడంతో ఈసారైనా సంపూర్తిగా పరిహారం చెల్లించి తాము ఎదుర్కొంటున్న కష్టాలు తీరాతాయా అనే ప్రశ్న అన్ని కుటుంబాల్లో ఉంది.

- వ్యక్తిగత పరిహారంలో దగా చేశారు
- ఓట్ల కోసం వైసీపీ నేతల నాటకాలు
- ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆశలు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దయ చూపాలంటున్న నిర్వాసితులు
- మంత్రి నిమ్మల దృష్టికి పలు సమస్యలు

ఏలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయస్థాయి బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణంలో ఎందరో త్యాగాలు ఉన్నాయి. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం తదితర ముంపు మండలాల్లో అనేక గ్రామాలు, వందలాది కుటుంబాలు పోలవరం నిర్మాణానికే త్యాగానికోర్చాయి. తాము నష్టపోయిన ఫర్వాలేదు గాని రైతులు బాగుపడాలనే కాంక్ష.. ఆకాంక్షే అందరిది. ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు 2014-2019 మధ్య అప్పట్లో కొన్ని గ్రామాలను ఖాళీ చేయించారు. కొన్ని గ్రామాలను ఖాళీ చేయించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఏలూరు జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడులో అత్యధిక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ గ్రామాల్లో గిరిజనులే ఎక్కువ. గిరిజనేతరులు కూడా ఉన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా రెండు మండలాల్లో గ్రామాలను ఖాళీచేసి వారిని పునరావాసా కాలనీలకు తరలించడానికి 15 క్రితమే కార్యాచరణ రూపొందించారు. ముంపు గ్రామాల్లో బాధిత కుటుంబాలను గుర్తించి పెళ్లి కాని వారికి కూడా పరిహారం ఇచ్చేందుకు సమ్మతించారు. ఆ మేరకు పరిహారం జాబితా విడుదల చేస్తున్నట్లు ఆశలు చూపుతూ వచ్చారు.

జగన్ సర్కార్ వంచన

గడిచిన ఐదేళ్లలో జగన్ సర్కారు వందలాది మంది నిర్వాసితులను వంచించింది. గడిచిన ఎన్నికలకు ముందుగానే నిర్వాసితుల భూములకు ఇచ్చే పరిహారం పూర్తి గా సవరిస్తామని, వ్యక్తిగత పరిహారం కూడా రూ.10 లక్షలకు పెంచుతామని, తాము అధికారంలోకి వస్తే ఇట్టే చేసి చూపుతామని అప్పట్లో జగన్ జనాలకు హామీనిచ్చారు. వాస్తవానికి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వ్యక్తిగత పరిహారం అందుకునే అర్హుల సంఖ్య వేలల్లో ఉంది. దీనికి అనుగుణంగానే పరిహారం చెల్లించడానికి సుమారు రూ.3 వేల కోట్లు అవసరమని అప్పట్లో గుర్తించారు. అది పెద్దపని కాదన్నట్లు అధికారం చేపట్టిన కొత్తల్లో జగన్ ప్రభుత్వం జీవో కూడా జారీ చేసింది. నిర్వాసిత కుటుంబాలన్నీ వ్యక్తిగత పరిహారం రూ.10లక్షలు దక్కుతుందని ఆశలు పెంచుకున్నారు. ఏళ్ల తరబడి నిర్వాసితుల ఆశలు ఒక్కటి కూడా నెరవేరలేదు. కేవలం కొద్దిమంది ఖాతాల్లో కొద్దిగా జమ చేసి మమ అన్పించారు. నిర్వాసిత కుటుంబాల్లోని అవివాహితులకు పరిహారం చెల్లించాలనే డిమాండ్‌కు తలూపి ఆనక పక్కకు తప్పుకున్నారు.

అభివృద్ధికి ఆస్కారం లేదు!

ముంపు గ్రామాల్లో గడిచిన దశాబ్దకాలంగా అభివృద్ధి ఆగిపోయింది. పరిహారం కూడా కొంత మేర చెల్లించినందున ఆయా గ్రామాలను వీడి నిర్వాసితులకు కేటాయించిన కాలనీలకు వెళ్లక తప్పదని ప్రభుత్వం నిర్దేశించింది. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆస్కారం లేదని పక్కాగా తేల్చింది. జగన్ పాలనలో ఒకవైపు పూర్తి పరిహారం కోసం ఎదురు చూసినవారిని ఎవరూ పట్టించుకోలేదు. అఖరికి పరిహారం పేరిట అనేక మంది అక్రమాలకు పాల్పడ్డారు. బోగస్ కుటుంబాలను తెరముందుకు తెచ్చి సర్కారు సొమ్మును కాజేసే ప్రయత్నం చేశారు. ఐటీడీఏ కేంద్రంగా జరిగిన కుంభకోణాలు అన్నీ ఇన్నీ కావు. ఇన్ని జరుగుతున్నా జరిగిన ఐదేళ్లలో నిర్వాసితులను ఆదుకోవడానికి వారికి కేటాయించిన కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపర్చడానికి శ్రద్ధ తీసుకుంటే ఒట్టు. సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యేలే ఈ దిశగా ప్రభుత్వాన్ని ఒప్పించలేకపోయారు. గిరిజనులు, గిరిజనేతర కుటుంబాలు కోరుకున్నట్లు పరిహారం విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారు. కనీసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచితే వందల కుటుంబాలు ఒడ్డెక్కుతాయన్న స్పూర్తికి భిన్నంగా వ్యవహరించారు. పోలవరం నిర్వాసితులకు బుట్టాయిగూడెం, పోలవరం జీలుగుమిల్లి మండలాల్లో ఏర్పాటైన కాలనీలకు కొద్ది మంది మాత్రమే తరలివచ్చారు. ఆయా కాలనీల్లో ఇప్పటికీ సౌకర్యాల లేమి తాండవిస్తోంది. పోల వరం కోసం అన్నీ త్యాగం చేసినా తమకు ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని ఎవరైనా నిలదీస్తున్నా తగు సమాధానం లేకుండా పోయింది.

సీఎం చంద్రబాబుపైనే కోటి ఆశలు

సీఎం చంద్రబాబునాయుడుపైనే నిర్వాసిత కుటుంబాలన్నీ కోటి ఆశలు పెంచుకున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో 41.75 మీటర్ల ఎత్తు వరకే ప్రాజెక్టు నిర్మిస్తారని, ఆ పరిధిలో వచ్చే గ్రామాలన్నింటికి మాత్రమే పరిహారం, అక్కడి నుంచి కుటుంబాల తరలింపు జరుగుతుందని చాన్నళ్ల పాటు హడావుడి చేశారు. అధికారులను రంగంలోకి దింపి వివరాలు సేకరించాల్సిందిగా కాలక్షేపం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మితమవుతుందని, ఎత్తు కుదింపునకు ఆస్కారం లేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం ముంపు గ్రామాలన్నింటిలో మళ్లీ కొత్త ఆశలు చిగురించాయి. ప్రాజెక్ట్ పూర్తి కావడంలో ముందస్తుగా తమకు పరిహారం చెల్లింపులోనూ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని నిర్వాసిత కుటుంబాన్నీ గట్టిగానే కోరుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఎత్తు తగ్గింపు పేరిట అనేక గ్రామాలకు పరిహారం చెల్లించడంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, ఇప్పుడు దానిని సవరించాల్సి అవసరాన్ని గుర్తు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం నిర్వాసిత కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి అవసరాన్ని గుర్తు చేస్తున్నారు.

పక్కా పునరావాసమే మార్గం

తాడువాయిలో నిర్మిస్తున్న అతి పెద్ద పునరావాస కాలనీలు దాదాపు 10వేల మంది నివసించేందకు అనువైంది. వీరందరికి తక్షణం ఉపాధికి చర్యలు తీసుకుంటే తప్ప వేలమంది కాలనీల్లో బతుకీడ్చడం కష్టమనే వాదనను అప్పటి కలెక్టర్ కాటంనేని భాస్కర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. చిన్నతరహా పరిశ్రమలను తీసుకురావడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని సూచించారు. కుక్కునూరు, వేలేరుపాడులో వున్న గిరిజన కుటుంబాలన్నీ రోజువారీ కూలీ, చిన్న చితక అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంతోనే పొట్టు పోసుకునేవారు. అదే విషయాన్ని సీఎం చంద్రబాబు కూడా పునరాలోచించాలన్న వాదన రేకెత్తుతోంది. నేడు పోలవరం పర్యటనకు వస్తున్న సీఎం పోలవరం నిర్వాసితుల విషయంలోనూ ఎలాంటి ప్రకటన చేస్తారనే ఉత్కంఠ అందరిలో ఉంది. పోలవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా జనసేన నుంచి చిర్రి బాలరాజును ఎన్నుకున్నారు. కూటమిలో జనసేన కూడా భాగస్వామి కాబట్టి ముఖ్యమంత్రి నిర్వాసితులను సంతృప్తిపరిచే విధానంలో ప్రకటన చేస్తారనే అందరూ వ్యక్తం చేశారు.

నిమ్మల.. పట్టుదల

జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు నిర్వాసితులు, ప్రాజెక్టు విషయంలో సహేతుక నిర్ణయాలకు అనువుగా వ్యవహరిస్తు న్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు ఇప్పటికే ఆయన దృష్టికి వెళ్లాయి. వారికి సాయం అందించడం, కాలనీల్లో సౌకర్యాలు కల్పన వంటి నిర్ణయాలకు మంత్రి చొరవ తీసుకుంటారన్న నమ్మకం నిర్వాసితుల్లో ఉంది. వీటిపై అధికారుల తో నిమ్మల సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడానికి పరిస్థితులు ఉన్నాయో కూడా ఆయన నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంతా వివరించే అవకాశం లేకపోలేదు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

పోలవరం డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పర్యటన ఈ నెల 16న ఈవిధంగా సాగనుంది.

- ఉదయం 10.45 గంటలకు పోలవరం ప్రాజెక్టు హిల్‌వ్యూ పాయింట్ వద్దకు చేరుకుంటారు.
- 10.45 నుంచి 10.50 వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరిస్తారు.
- 10.50 నిమిషాలకు హిల్‌వ్యూ ప్రాంతం నుంచి ప్రాజెక్టు పరిశీలిస్తారు.
- 11.05 నుంచి 12.05 వరకూ ప్రాజెక్టులో గ్యాప్ 1, ఛానల్ 540 వద్ద వైబ్రోకాంపాక్షన్ పనులు, ఛానల్ 210 వద్ద గ్యాప్ 2 పరిశీలన, గ్యాప్ 2 పరిశీలన, 800 ఛానల్ వద్ద డయాఫ్రంవాల్ ప్లాట్ ఫాం పనులు పరిశీలిస్తారు.
- 12.20 గంటలకు ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుని భూసేకరణ ఆర్‌అండ్‌ఆర్ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.
- 12.50 గంటల నుంచి 1.15 వరకూ ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రాజెక్టు కార్యాలయ అతిథి గృహానికి తరలి వెళతారు.
- 1.25 గంటలకు హెలీప్యాడ్ ప్రాంతం నుంచి హెలీకాప్టర్‌పై బయల్దేరి 2.15 గంటలకు వెలగపూడి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సెక్రటేరియట్‌కు చేరుకుంటారు.



ఐజీ, ఎస్పీతో మంత్రి నిమ్మల సమీక్ష

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

పోలవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పర్యటన నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ప్రాజెక్ట్ ప్రాంతం పరిశీలించారు. ప్రాజెక్టు అతిథిగృహంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. పోలీసు, భద్రతా బలగాలు, డాగ్, బాంబ్ స్క్వాడ్ సీఎం పర్యటించనున్న ప్రాంతాలు పరిశీలించారు. 8 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 576 మంది పోలీసులు అదనంగా ప్రత్యేక భద్రతా విభాగ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్, హెలీ ప్యాడ్ ఏర్పాట్లు, పార్కింగ్, వీవీపీ గ్యాలరీ, సమా వేశపు హాలు తదితర ఏర్పాట్లపై జేసీ ధాత్రిరెడ్డి సమీక్షించారు. పొరపాట్లకు తావులేకుండా సీఎం పర్యటన ఏర్పాట్లపై సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు


శిక్షణ పొందుతున్న పశు వైద్యులు

పశువులకు ఆధునిక చికిత్సలు

తణుకు పశు ఆరోగ్య సంస్థలో పశువైద్యులకు శిక్షణ

తణుకు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పశు వైద్యు లకు పలు రకాల శస్త్ర చికిత్సలకు సంబంధించి తణుకు రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ (పశు వైద్యశాల)లో సీనియర్ వైద్యులచే ఉత్తమ శిక్షణ అందిస్తున్నారు. మూడు రోజులు పాటు ఎనిమిది మంది ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ ఉంటుంది. ఒక్కొక్కరు కోర్సు కోసం 15 వేలు చెల్లించాలి. కోర్సు చేసే వారికి వసతి ఏర్పాటు చేస్తారు. ఖచ్చితంగా రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ లేదా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సీనియర్ ఫ్యాకల్టీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీధర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. జాతీయ స్థాయిలో నిర్వహించే శిక్షణ తరగతుల్లో ప్రధానంగా ఆసుపత్రికి వచ్చే పశువుల్లో ఉన్న సమస్యను బట్టి శస్త్ర చికిత్సలు సులువుగా చేయడం ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు ఉన్న శస్త్ర చికిత్సలు కన్నా మారుతున్న టెక్నాలజీ అనుగుణంగా మెరుగైన చికిత్సా విధానాలపై వివరిస్తారు. ఎముకలు విరిగినపుడు ఏమి చేయాలి ? నొప్పులు వచ్చినపుడు ఏ విధంగా ట్రీట్ చేయాలనే విషయాలను శిక్షణలో వివరిస్తారు. ఇక్కడ శిక్షణ కోసం వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారు.

• బేసిక్స్‌పై అవగాహన



శిక్షణలో నేర్పించిన బేసిక్స్ బాగా ఉపయోగ పడుతున్నాయి. ముఖ్యంగా ఆర్థోపెడిక్‌కు సంబంధించిన అంశాలు ఉపయుక్తంగా ఉన్నాయి. శిక్షణలో ప్రతి అంశం బాగా వివరిస్తున్నారు. పశు వైద్యంలో కుక్కలు, మేకలు, గేదెలు, ఆవులకు ఎముకలు విరిగినపుడు ఎలా ట్రీట్ చేయాలే అంశాలు ఉపయుక్తంగా ఉన్నాయి. మనుషుల్లో ఎలాంటి స్కిల్స్ ఉన్నాయో, పశువుల్లో కూడా వాటిని ఎలా ఉపయోగించాలో వివరించారు.

-డాక్టర్ కె.ఫిలిప్, కేరళ

• కొత్త పద్ధతులు నేర్పించారు



శిక్షణలో కొత్త పద్ధతులు నేర్పించారు. ముఖ్యంగా ఆవులు, మేకలు, కుక్కలు, గేదెలు, ఇతర పశువుల్లో ఆర్థోపెడిక్ సమస్యలు గురించి బాగా నేర్పించారు. ఎముకుల విరిగిపోతే దానిని కొత్త పద్ధతిలో ఎలా చేయాల్లో వివరించారు. ప్లేటింగ్, పిన్నింగ్, బోన్సు గురించి చెప్పారు. మూడు రోజుపాటు ఎక్కడా సమయం వృధా లేకుండా శిక్షణ అందించారు.

-డాక్టర్ నిఖిత్, మైసూర్

పూర్తి అవగాహనే లక్ష్యం



ప్రధానంగా ఆర్థోపెడిక్ సమస్యలు వచ్చినపుడు ఎలా చేయాలనే దానిపట్ల పూర్తి అవగాహన కల్పించడమే ఈ శిక్షణ లక్ష్యం. మూడురోజుల శిక్షణలో ఏఏ అంశా లపై అవగాహన కల్పించాలనేదానిపై ప్రణాళిక తయారు చేసుకున్నాం. మెరుగైన, సీనియర్ ఫ్యాక ల్టీలచే శిక్షణ ఇస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా వచ్చి శిక్షణ పొందుతున్నారు.

డాక్టర్ వాకాని ప్రసాదు,
డిప్యూటీ డైరెక్టర్, తణుకు

సంక్రాంతి సెలవులపై పునరాలోచన చేయాలి


మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : తెలుగుప్రజలకు పెద్దపండుగైన సంక్రాంతి సెలవుల్లోనూ పదో తరగతి సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిం దేనంటూ వందరోజుల కార్యాచరణలో ఆదేశించడంపై ప్రభుత్వం పునరాలోచన చేసి సడలింపు చేయాలని ఉభయ గోదావరిజిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సంబంధించి శాసన మండలిలో ప్రస్తావించే వివిధ సమస్యలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలపై విసుగుచెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషిచేయడంతో పాటు, కొత్త ప్రభుత్వంలో పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించారన్నారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం కొలువుతీరి ఆరునెలలు గడిచినా ఇంతవరకు మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించలేదని, వీటితో పాటు పలు సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతుల పేరుతో స్థానచలనం కలిగించడం వేధించడమేనని ఆరోపించారు. మండలాల్లో ఎంపిక చేసిన జడ్పీ హైస్కూళ్లలోనే ఇంటర్‌విద్యను అందించేందుకు మూడేళ్ళక్రితం ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లను కొత్త ప్రభుత్వం ఎత్తివేయనునట్టు సంకేతాలు వస్తున్నాయని పూర్తిస్థాయి ఫలితాలు రాబట్టకుండానే ఎత్తివేయాలనుకోవడాన్ని పీడీఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి కనీస వేతన స్కేళ్ళ (ఎంటీఎస్)ను వర్తింపజేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ఉత్తర్వులతో ప్రభుత్వ పాఠశాలలు పెద్ద సంఖ్యలో మూతపడ్డాయని, వివాదాస్పదమైన ఆ జీవోను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇపుడు అదే జీవో వాసనలున్న ఉత్తర్వుల సారాంశాన్నే పేర్కొంటూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటే, తెలుగు మాధ్యమాన్నికూడా సమాంతరంగా బోధించేందుకు సెక్షన్లు, టీచరు పోస్టులు మంజూరు చేసినపుడే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఉంటుందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా నాయకులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, రాంబాబు, సుభాషిణి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



సరిగమ పాడుతా హాయిగా రాష్ట్రస్థాయి సినిమా పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న వ్యవస్థాపకుడు కోటేశ్వరరావు

పాడుతా హాయిగా విజేతలకు బహుమతులు

ఆకివీడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సరిగమ సంగీత పరిషత్ కళామతల్లిలాంటిదని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో సంగీత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శింగవరపు కోటేశ్వరరావు, కార్యదర్శి కొల్లి వెంకన్నబాబు ఆధ్వర్యంలో సరిగమ పాడుతా హాయిగా రాష్ట్రస్థాయి సినిమా, ఘంటసాల పాటల పోటీలు జరిగాయి. ప్రథమ ఎం. అనుషా దేవి, ద్వితీయ బాల ఆదిత్య, తృతీయ ప్రసాద్‌లకు బహుమతులు అందజేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళ అన్ని రంగాల్లో గొప్పదన్నారు. జీవితమే ఒక కళని, మనిషిని కూడా నడిపించేది కళ అన్నారు. సరిగమ జీవన సాఫల్య, జీవన పురస్కార, అభినందన గ్రహీతలకు పురస్కారాలు అందజేశారు. జబర్దస్త్ ఆర్టిస్టులు షేకింగ్ శేష, వినోద్‌లు స్కిట్స్ ప్రదర్శించారు. అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

సేవ్ ద గర్ల్..

పాలకొల్లులో ఉత్సాహంగా 2కే రన్

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో ఆదివారం ఉదయం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో 2కె రన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరించాయి. అనంతరం మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, జిల్లా కలెక్టర్ నాగరాణిలు జెండా ఊపి 2కె రన్ ప్రారంభించారు. గాంధీ బొమ్మల సెంటర్ నుంచి మొయిన్ రోడ్డు మీదుగా యడ్లబజారు, బస్టాండ్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మల సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు సేవ్ ద గర్ల్ చైల్డ్ అంటూ నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. గాయని మధుప్రియ, సీరియల్ నటి దీపిక,చిన్నారి వాగ్దేవి పాటలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీ వేద, కూటమి నాయకులు జీవి, విజయభాస్కర్, శేఖర్, అప్పారావు, గాంధీ భగవాన్ రాజు, కర్నేన గౌరు నాయుడు, రోజా రమణి, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, కపర్ధి, బోణం చినబాబు, పద్మారావు, సమన్వయ కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


పాలకొల్లులో 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు




అలరించిన నృత్య ప్రదర్శనలు.. విన్యాసాలు

మహిళలను గౌరవిస్తేనే మనుగడ
హోం మంత్రి వంగలపూడి అనిత

జగతికి జన్మనిచ్చిన మహిళలను గౌరవిస్తేనే జాతికి మనుగడ ఉంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించాలన్న సంకల్పం మన ఇంటినుంచే ప్రారంభం కావాలన్నారు. ప్రజా సేవకే అంకితన మంత్రి నిమ్మల రామానాయుడు విజయం వెనుక ఆయన భార్య సూర్యకుమారి ఉన్నారని అభినందించారు. సేవ్‌దగర్ల్ చైల్డ్ కార్యక్రమం క్రమం తప్పకుండా ప్రతీ రెండేళ్లకు ఒకసారి నిర్వహించడం అభినందనీయమన్నారు.

విద్యుత్ చార్జీలపై దశలవారీ ఉద్యమాలు : సీపీఎం


బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న మంతెన సీతారామ్

బుట్టాయగూడెం, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మహాసభల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై దశలవారీ ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారామ్ పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం ఆర్.సత్యనారాయణరాజు ప్రాంగణంలో జరుగుతున్న జిల్లా మహాసభలో మూడో రోజున పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. విద్యుత్ చార్జీల వలన ప్రజలు, పరిశ్రమలపైన భారం పడుతోందన్నారు. జిల్లా సభల కర్తవ్యాల అమలు కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి కమిటీ నివేదిక ప్రవేశ పెట్టారు. సభలకు టి.రామకృష్ణ, ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎస్.శారద, ఎం.జీవరత్నం అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు జి.రాజు, ఎం.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి కాకినాడలో రాష్ట్ర మహాసభలు

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏలూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : జనవరి 5 నుంచి 8వరకు కాకినాడలో యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహించ నున్నట్టు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ ప్రకటించారు. సంఘ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవ మహాసభలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 20 వేలమంది ఉపాధ్యాయులు హాజరవుతారన్న అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లను ఇప్పటికే ఆహ్వానించామని, మరికొందరు ప్రముఖులు, విద్యావేత్తలు కూడా హాజరవు తారని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామ న్నారు. పాతపద్ధతిలోనే అన్ని పాఠశాలలను కొనసాగించాలని, హైస్కూల్ ప్లస్‌లకు మరిన్ని సౌకర్యాలు కల్పించి వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లస్ టూ విద్యను బోధిస్తోన్న పీజీటీలకు ప్రమోషన్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు.

సాబ్జీ ప్రథమ సంస్మరణ సభ

పీడీఎఫ్ దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రథమ సంస్మరణ సభ ఆదివారం ఏలూరు యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. వివిధ సమస్యలపై యూటీఎఫ్, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటాల్లో చురుకుగా పాల్గొన్న సాబ్జీ చివరకు ఉద్యమంలోనే దుర్మరణం చెందటం విచారకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత నాయకత్వం నడవాలని ఆకాంక్షించారు. సాబ్జీ సతీమణి సుభాన్‌బేగం, కుమారుడు అజాద్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, కన్వీనర్ రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ హరనాథ్, యూటీఎఫ్ జిల్లా నాయకులు షేక్ ముస్తఫాఅలీ, రవి కుమార్, వెంకటేశ్వరరావు, రంగమోహన్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీల వల్ల సినిమాలు ఆడడం లేదు

జబర్‌దస్త్ నటుడు షేకింగ్ శేషు



ఆకివీడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఓటీటీ వల్ల సినిమాలు ఆడకపోవడంతో కళాకారులు రోడ్డున పడుతున్నారని జబర్‌దస్త్ నటుడు అద్దంక శేషుకుమార్ (షేకింగ్ శేషు) అన్నారు. రాష్ట్రస్థాయి పాటల పోటీల కార్యక్రమానికి ఆకివీడు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఊరిలో ఉన్నప్పుడు నాటకాల్లో మిమిక్రీ చేసేవాడిని... సినిమాల్లో ఆసక్తితో మద్రాస్ వెళ్ళితే ఛాన్సులు రాలేదు. తీసుకెళ్ళిన డబ్బులు అయిపోయాయి. సీరియల్స్‌లో డబ్బింగ్ చెప్పేవాడిని...తరువాత జబర్దస్త్‌లో అవకాశం రావడంతో కామెడీ షోలు చేశాను. అనంతరం సినిమాలో అవకాశాలు వచ్చాయి. ఇప్పటి వరకూ 50 సినిమాల్లో నటించానన్నారు. సోషల్ మీడియా వచ్చిన తరువాత నిర్మాతలు కనుమరుగవుతున్నారన్నారు.


మద్ది క్షేత్రంలో దీక్ష విరమణకు వచ్చిన హనుమద్ భక్తులు

దీక్ష విరమించిన హనుమద్ దీక్షాధారులు



జంగారెడ్డిగూడెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి సందర్భంగా మహా పూర్ణాహుతి నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హనుమద్ దీక్షధారులు పాల్గొన్నారు. స్వామి వారికి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించారు. ఈవో ఆర్‌వీ చందన తగిన ఏర్పాట్లు చేశారు.



సమావేశంలో పాల్గొన్న యూత్ హాస్టల్స్, జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు

జాతీయ సమైక్యతను ప్రోత్సహించడమే యూత్ హాస్టల్స్ లక్ష్యం

భీమవరం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : పర్యాటకం, అడ్వెంచర్ స్పిరిట్, జాతీయ సమైక్యత, విద్య ఆరోగ్య సమాజాన్ని ప్రోత్సహించడం యూత్ హాస్టల్స్ లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. త్యాగరాజ భవనంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ 35 వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. సామాజిక, అభివృద్ధి సమస్యలపై యువతలో అవగాహన పెంపొందించడం యూత్ హాస్టల్స్ ప్రత్యేకత అని, యువతలో పట్టుదల, ఆత్మ విశ్వాసం పెరగటానికి, విద్య, జీవన నైపుణ్యాలు పెరగటానికి యూత్ హాస్టల్స్ చేస్తున్న సేవలు అమోఘమని అన్నారు. యూత్ హాస్టల్స్ భీమవరం యూనిట్ దక్షిణ భారత దేశంలో రెండవ అతి పెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. యూత్ హాస్టల్స్ జాతీయ చైర్మన్ మనోజ్ జోహిరి, నేషనల్ వైస్ చైర్మన్ రవిశంకర్ పాల్ మాట్లాడుతూ మొదటి స్థానంలోకి రావడానికి ప్రయత్నం చేయాలన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళ నాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి విచ్చేసిన 100 మంది యూత్ హాస్టల్స్ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. యూత్ హాస్టల్స్ చైర్మన్ డాక్టర్ సోమ రాజు, మాట్లపూడి సత్యనారాయణ, భీమవరం అధ్యక్షుడు చిలుకూరి నరసింహరాజు, కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్, కార్యదర్శి నందమూరి రాజేష్, బోండా శ్రీరామ్, పాండు రంగారావు, అరేటీ సత్యనారాయణ,చెరుకువాడ రంగసాయి, జనపాటి మధుసుధన్‌రావు, మల్లినీడి తిరుమలరావు, ఉమామహేశ్వరరావు, తాళ్ల పూడి గాంధీ, రవిపాల్, తదితరులు పాలొన్నారు.

క్రైమ్ కార్నర్

ట్రాక్టర్ బోల్తా- డ్రైవర్ మృతి

నరసాపురం రూరల్, డిసెంబరు 15,(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సారవ గ్రామంలో దమ్ము ట్రాక్టర్ అదుపు తప్పి, బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ కంచర్ల యుగంధర్ పాపారావు (33) మృతి చెందిన్నట్లు రూరల్ ఎస్సై వెంకట సురేష్ చెప్పారు. వరి చేలో దమ్ము చేస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. సంఘటనా స్థలంలోనే యుగంధర్ చనిపోయాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పిచ్చి కుక్క స్వైర విహారం ముగ్గురు పిల్లలకు గాయాలు

నరసాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పార్కు రోడ్‌లోని సాయి బాబా ఆలయం వద్ద ఆదివారం పిచ్చి కుక్క ముగ్గురు పిల్లల్ని గాయపర్చింది. గుడి సమీపంలో ఆడుకుంటున్న ఇద్దరి పిల్లల్ని ముందుగా కరిచింది. వారు కేకలు వేయడంతో స్థానికులు ఆ కుక్కను తరిమేశారు. అటు నుంచి పారిపోయి శునకం 13 వార్డుకు చేరింది. అక్కడ రోడ్డుపై ఉన్న మరో పిల్లవాడిని కరిచింది. అయితే శునకాన్ని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించినా చిక్కలేదు.గాయపడిన ముగ్గురు పిల్లల్ని ప్రభుత్వ అస్పత్రికి తరలించి వ్యాక్సిన్ వేయించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. మండవల్లి మండలం దెయ్యంపాడు గ్రామానికి చెందిన ముంగర పాండురంగారావు (62) ఆదివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై తోకపల్లి గ్రామం వెళ్తున్నాడు. మార్గమధ్యలో 16వ నెంబర్ జాతీయ రహదారి దెందులూరు మండలం గుండుగొలను సమీపంలో గుర్తు తెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొని వెళ్ళిపోయింది. తీవ్ర గాయాలకు గురైన అతనిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహా నికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ఏలూరు క్రైం, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఏలూరు రైల్వే స్టేషన్ సమీపంలోని సుమారు 75 ఏళ్ళ వయస్సు కల్గిన గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలతో ఉన్నట్లు 108 అంబులెన్సుకు సమా చారం అందడంతో అతనిని ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు చొక్కా, నీలం రంగు గళ్ళలుంగీ కల్గి ఉన్నాడు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమా చారం ఇచ్చారు. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

210 మద్యం బాటిళ్లు పట్టివేత

జీలుగుమిల్లి, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తెలంగాణ మద్యం రవాణా చేసినా నిల్వ ఉంచి అమ్మినా కేసులు తప్పవని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు అన్నారు. తెలంగాణ నుంచి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 210 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఎక్సైజ్ అధికారులు తనిఖీల్లో పట్టుకున్నారు. ఎ.పోలవరానికి చెందిన బి.రామకృష్ణ ఆటోలో తరలిస్తున్న మద్యం పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మీ, సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

కోడిపందేలపై దాడి.. రూ.52 వేలు స్వాధీనం

ద్వారకాతిరుమల, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): నారాయణపురంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం ద్వారకాతిరుమల పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది పందెగాళ్లను అరెస్ట్ చేశారు. జూదరుల నుంచి రూ.52,080 నగదు, 5 బైక్‌లు, 2 కోడిపుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా మండలంలో కోడిపందేలు, పేకాటలు ఆడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఎస్పీపై తేనెటీగల దాడి


పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యులు

పోలవరం, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ముఖ్య మంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో ఆది వారం సాయంత్రం అపశృతి చోటు చేసుకుంది. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన అప్రోచ్ ఛానల్ రోడ్డు మార్గంలో 23 గేటు వద్ద నుంచి 24 గేటు వద్దకు భద్రతా ఏర్పాట్ల తనిఖీలు నిర్వహిస్తున్న ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ రామ కృష్ణపై అక్కడే ఉన్న తేనెతుట్టె కదిలి తేనెటీగలు దాడి చేయ డంతో అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన పోలీసులు ఆయనను పోల వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధి గొత్తూరు తండా గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. నాటుసారా తయారీకి ఉద్దేశించి నల్లబెల్లాన్ని అమ్మినా, లేక బెల్లు షాపులు నిర్వహించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను అభినందిస్తున్న సంఘ నాయకులు

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.ఆంజనేయులు, కె.వి.వి. సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జడ్పీ కార్యాలయ ఆవరణలోని మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో సంఘ కౌన్సిల్ సమావేశం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.యేసురాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, రమణ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సంఘ జిల్లా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఆదివారాలు, సెలవు దినాల్లో సైతం పదో తరగతి పరీక్షార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సర్‌ప్లస్ టీచర్లను పని సర్దుబాటు పేరుతో ప్రతి నెలా పలు పాఠశాలలకు తిప్పడం వల్ల బోధన కుంటుపడుతుందన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పలు మండ లాల నుంచి సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అమరజీవికి కలెక్టర్ నివాళి



ఏలూరులో ఎమ్మెల్యే చంటి నివాళి



ఆర్యవైశ్య సంఘం నాయకుల నివాళి



చింతలపూడిలో అమరజీవి, పటేల్‌కు కమిషనర్ పావని, ఆర్యవైశ్య సంఘం నాయకుల నివాళి

అమరజీవి భావితరాలకు స్ఫూర్తి

▸ కలెక్టర్ వెట్రిసెల్వి ▸పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులు

ఏలూరు సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు భావితరాలకు స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆదివారం వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా నిర్వహించిన ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు వర్థంతిని ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, బీసీ సంక్షేమ శాఖ ఈడి ఎన్. పుష్పలత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ త్రినాధ్‌బాబు కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య పాల్గొన్నారు.

ఏలూరు టూ టౌన్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. వసంతమహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జీవిత విశేషాల పై ప్రభుత్వ గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఏలూరు రూరల్: ఆంధ్ర రాష్ట్రం పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరమని, ఏలూరు అర్బన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మద్దులకుమార్, ఉపాధ్యక్షులు కెకె గుప్తా, కోశాధికారి బచ్చు విష్ణు అన్నారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి సత్రం వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

లింగపాలెం: పొట్టిశ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. అమర జీవి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బుట్టాయగూడెం: విప్పలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కామవరపుకోట: కామవరపుకోట ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవి, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు, తొలుత భారీ ప్రదర్శన నిర్వహించారు.

చింతలపూడి: చింతలపూడి మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు, సర్దార్ వల్లాభాయ్‌పటేల్ చిత్రపటానికి కమిషనర్ డి. పావని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు అమరణ దీక్ష వల్ల దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. సర్దార్ వల్లాభాయ్‌పటేల్ దేశంలో ఉన్న 500 సంస్థానాలను ప్రభుత్వంలో విలీనం చేసి ఉక్కు పనిషిగా పేరుగడించారని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్యులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

టి.నరసాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ మూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం, జగ్గవరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య యువజన సంఘం మండల అధ్యక్షులు పసుమర్తి రాము, టి.నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అద్దంకి గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి: అమరజీవి జీవితం మార్గదర్శకమని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. పెదవేగిలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. టీడీపీ నాయకులు తాతా సత్యనారాయణ, కంచెన మోహనరావు, యశ్వంత్, వాసవీ క్లబ్ సభ్యులు కొనకళ్ళ నాగేశ్వరరావు, నామాలు, బలరామకృష్ణ, వెంకటేశ్వరరావు, పాపారావు తదితరులు అమరజీవికి నివాళులర్పించారు.



పాత్రికేయుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే పత్సమట్ల

ఉంగుటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు నియోజకవర్గ సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ పాత్రికేయుల సమస్యలపై నెలకోసారి సమావేశం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ధర్మరాజు తెలిపారు. ఆదివారం కంసాలి గుంట తోటలో ఉంగుటూరు నియోజకవర్గ పాత్రికేయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులపై దాడులు అరికట్టాలంటూ ఎమ్మెల్యే కు వినతి పత్రం అందించారు.

రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి

భీమడోలు: రైతు ప్రయాజనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. ఆదివారం భీమడోలు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. కూటమి నాయకులు ప్రత్తి మదన్, పైడిమాల యుగంధర్, తాటిమళ్ళ రామ్మూర్తి, ఆదిరెడ్డి సత్తిబాబు, దుర్గారావు, వెజ్జు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. గిరిజన భవన్‌లో అఖిలభారత ఆదివాసి ఉద్యోగుల సంఘం డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడుతూ ఎస్టీలకు ప్రత్యేక భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానన్నారు. ఆదివాసి ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి ఎల్‌ఎంవి డ్రైవర్లకు హెచ్‌ఎంవి డ్రైవర్లుగా పదోన్నతిని కల్పించాలని ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం సంఘ భవనంలో జరిగింది. పిఆర్సీ, ఇళ్ళస్థలాలు, మున్సిపల్ శాఖల ఎల్‌ఎంవి డ్రైవర్లకు, హెచ్‌ఎంవి డ్రైవర్లకు పదోన్నతులకు సంబంధించి చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు పరసాని శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు డి.ఎస్ కొండయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

షేక్ సాబ్జికి నివాళి

ఉంగుటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి ఆదివారం ఉంగుటూరు మండల యూటీఎఫ్ శాఖ నారాయణపురం హైస్కూలులో నివాళులర్పించింది. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాకి జోగి నాయుడు, ఉనుముల రాంబాబు, ఆనంద్, ఉప్పిలి వెంకటేశ్వరరావు, మీరా సాహెబ్, పుప్పాల నరసింహారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జనసైనికుల ఆర్థిక సాయం

పోలవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెట్టగూడెంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమై కలుం సారయ్య కుటుంబం నిరాశ్రయమైంది. వారిని జనసేన మండల అధ్యక్షులు గునపర్తి సత్యన్నారాయణ పరామర్శించి రూ. 6 వేలు జనసేన తరపున బాధితులకు అందించారు. మండల ఉపాధ్య క్షులు తెలగంశెట్టి రాంప్రసాద్, కురసం రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 5,616 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్

ఏలూరు క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో ఈ నెల 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5,616 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమ కుమార్ ఆదివారం వెల్లడించారు.



ఉమ్మడి పశ్చిమ గోదావరి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 33 జాతీయ లోక్ అదాలత్ బెంచిలను ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులో ఏడు బెంచీలు, భీమవరంలో నాలుగు, నర్సాపురం నాలుగు, తణుకు నాలుగు, తాడేపల్లిగూడెం మూడు, పాలకొల్లు రెండు, నిడదవోలు ఒకటి, జంగారెడ్డిగూడెం ఒకటి, చింతలపూడి ఒకటి, భీమడోలు ఒకటి చొప్పున బెంచీలు ఏర్పాటు చేశామన్నా రు. ఈ లోక్ అదాలత్‌లో 5616 కేసులు పరిష్కరించా మని, వీటిలో 5259 క్రిమినల్, 170 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, 187 సివిల్ కేసులను రాజీ చేశామన్నారు. వీటితో పాటుగా 87 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరిం చామన్నారు. న్యాయ వాదులు, పోలీసు అధికా రులు, బ్యాంక్ అధికారులు, చిట్ ఫండ్ ప్రతినిధులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ, రవాణాశాఖ, ఎక్సైజ్, రైల్వే శాఖ అధికా రులు, న్యాయవాద గుమస్తాలు, అగ్రి కల్చరల్ అధికారులు అందరి సహకారంతో కేసులు పరిష్కరించామన్నారు.

పురోగమనం దిశగా రాష్ట్రం : చింతమనేని

పెదవేగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళ అరాచక పాలన నుంచి విముక్తి పొందిన రాష్ట్రం పురోగమన దిశగా అడుగులు వేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘా ల సభ్యులు ఎమ్మెల్యే ప్రభాకర్‌ను దుగ్గిరాలలో ఆదివారం కలిశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 66 నీటి సంఘాల్లోనూ నూరుశాతం కూటమి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం శుభపరిణామని అన్నారు. గడచిన ఐదేళ్ళు నీరందక రైతులు పంట నష్టాలను చవిచూశారని, ఇకపై ఆ సమస్య రాదని, కాలువ చివరి భూములకు కూడా నీరందించే దిశగా నీటిసంఘాల సభ్యులు శ్రద్ధ తీసుకోవాలని, అప్పుడే రైతు సంక్షేమం సాధ్యపడుతుందని ఆయన సూచించారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, కమ్మ శివరామకృష్ణ, తలకొండ జమలయ్య, సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.





క్రిస్మస్ వేడుకల్లో సందేశమిస్తున్న జడ్పీ ఇన్‌ఛార్జ్ సీఈవో విజయ్‌రాజు

ఘనంగా సెమీ క్రిస్మస్

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏలూరు కల్వరి స్వస్థత మందిరం పాస్టర్ కాటూరి సుధాకర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిని శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ, జడ్పీ ఇన్‌ఛార్జ్ సీఈవో డాక్టర్ ఆర్.విజయ్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీస్తుమార్గంలో నడవాలని సందేశమిచ్చారు. ప్రార్థనలు, గీతాలాపన జరిగాయి. కేక్ కట్‌చేసి పంచారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కృపావరం, స్టీవెన్, డివైఈవో రవిప్రకాష్, మాన వత సభ్యుడు అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి: మానవాళిని పాపాల నుంచి రక్షించడానికి క్రీస్తు ఈ లోకానికి వచ్చాడని పెనుయేలు ప్రార్ధనా మందిరం పాస్టర్ కె.జాన్ పాల్ అన్నారు. లక్ష్మీపురంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్వాసుడు కూరాకుల పోతురాజు ఇంటి వద్ద జరిగిన వేడుకలను పాస్టర్ జాన్‌పాల్ కేక్‌కట్‌చేసి ప్రారంభించారు. విశ్వాసులు పాల్గొన్నారు.



కళాకారుల నృత్యాభినయం

ముగిసిన జాతీయ నృత్య పోటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి, జానపదం, ఒడిస్సీ నృత్యాలు కనువిందు చేశాయి. అభినయ నృత్యభారతి 29వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సెలా నాగకోటేశ్వరరావు కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి నృత్య పోటీలు ఘనంగా ముగిసాయి. ఆదివారం దువ్విరూపేష్‌చంద్ర, ఎస్.కావ్యసిద్ధిక, రిత్విక్ వెంకట్, చార్మిల వెంకట్, స్రవంతి కిషోర్, కె.హర్షశ్రీ తమ నృత్యాలతో చూపరులను మైమరిపించారు. నాట్యంలో విశేష సేవలు అందించిన వారికి నృత్య తపస్వి, నృత్య కౌముది అవార్డులను ప్రదానం చేశారు. నాట్యాచార్య దువ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

తురగా రామకృష్ణకు అవార్డు

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు చెందిన తురగా రామకృష్ణ సేవా కార్యక్రమాలకు గాను అభినయ నృత్య భారతి సంస్థ 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు సేవా తపస్వి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు వేణుబాబు, డాక్టర్ సుబ్బారావు, ఎల్.వెంకటేశ్వరరావు, పామర్తి అచ్యుత్ గౌడ్, ఎస్.కిషోర్, బ్రాహ్మణ ఐకాస నాయకులు కె.రవి, సుబ్రహ్మణ్యం, హనుమంతరావు, శర్మ, ఎన్జీవో నాయకులు సాంబశివరావు, విద్యుత్ సంఘ నాయకులు ఎస్.నరసింహారావు తదితరులు తురగాను సత్కరించారు.

గుంటూరు తరలిన దళిత నాయకులు

చింతలపూడి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):హలో మాల చలో గుంటూరు సభకు చింతలపూడి మండలంలోని పలు గ్రామాల దళిత నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు ఈ నినాదం ద్వారా గుంటూరు సభలో మాలలు చెప్పదలుచుకున్నామన్నారు. సుప్రీంకోర్టు కూడా తమ మనోభావాల్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.



క్రిస్మస్ సువార్త ర్యాలీ

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మన్నాచర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సువార్త ర్యాలీ నగరంలో పాస్టర్ ఎం.జ్యోతిరాజు అధ్యక్షతన నిర్వహించారు. క్రీస్తును స్తుతిస్తూ ర్యాలీ సాగింది. క్రైస్తవ సంఘాలు, విశ్వాసులు పాల్గొన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో క్రిస్మస్ ఆరాధన పండుగలు సెయింట్ జేవియర్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు మన్నాచర్చ్ నిర్వహకుడు పాస్టర్ ఎం.జ్యోతిరాజు తెలిపారు.

విజ్ఞానాన్ని పెంచేది గ్రంథం

పెదవేగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతోపాటు వివేకాన్ని పెంచేది గ్రంథమని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథ పఠనం చేశారు.

కోడిపందేలపై దాడులు

కుక్కునూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వంజంవారిగుంపు గ్రామ శివారుల్లో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు పుంజులు, రెండు కోడి కత్తులు, రూ. 3220 నగదు, 3 సెల్‌ఫోన్లు, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

దెందులూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 40 ఏళ్ల క్రితం చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడం ఆనందంగా ఉందని దెందులూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి, పూర్వ విద్యార్థి గారపాటి కొండయ్య చౌదరి, పూర్వ విద్యార్థి, చింతలపూడి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బి. శేఖర్, రియల్ ఎస్టేట్ బిల్డర్ వి. సురేష్ ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం దెందులూరు శ్రీగారపాటి హైమవతీ దేవి ఉన్నత పాఠశాలలో 1985-86లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నాటి స్మృతులను గుర్తుకుతెచ్చుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కె. అంజరయ్య, ఎన్ రాధాకృష్ణ, ఎం. వెంకటేశ్వరరావు, రోజారాణి, విజయనిర్మల, పద్మ, సత్యవతి తదితరులు హాజరయ్యారు.



నృత్యం చేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల 40 వసంతాల వేడుకలు

ఏలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మండలం శనివారపుపేట జడ్పీ హైస్కూల్ నిర్మించి 40 ఏళ్ళు పూర్తికావడంతో పూర్వ విద్యార్థులు 40 వసంతాల వేడుకలను ఆదివారం గురువులతో కలిసి ఘనంగా నిర్వహించారు. సుమారు 3 వేల మందికి పైగా 8, 9, 10 తరగతులు చదివిన పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి గురువులను సత్కరించారు. దివంగతులైన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. పూర్వ విద్యార్థులు కారంపూడి విజయ్‌పాల్, కొప్పిశెట్టి రాజేష్ తదితరులు పర్యవేక్షించారు.



ద్వారకాతిరుమలలో స్వామి ఊరేగింపు



కైకరంలో తెప్పోత్సవం



రాట్నాలమ్మ వారి



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు

ఆధ్యాత్మికం

తిరువీధుల మెరిసే దేవదేవుడు ..

ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుడు ఉభయ దేవేరులతో కలసి ఆదివారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. కోర్ల పౌర్ణమిని పురస్కరించుకుని ముందుగా ఆల యంలో స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనం పై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంక రణ అనంతరం పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతి ఇంటి ముందు భక్తులు స్వామివారి, అమ్మవార్లకు హారతులు పట్టారు. కాగా ఆదివారం ద్వారకాతిరుమల భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో పాటు వివాహాలు జరుగుతుండటంతో యాత్రికుల సందడితో ఆలయం శోభిల్లింది. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటన్నర పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం

ఉంగుటూరు: మండలంలోని కైకరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి తెప్పోత్సవం శనివారం రాత్రి పంచాయతీ చెర్వులో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల బాణసంచాను కాల్చడంతో పాటు చెర్వులో హంస వాహనంగా తయారు చేసి స్వామిని చెర్వు మధ్యలో ఊరేగించారు. మధు మేహ న్నారులకు నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.పి.వి.రావు సౌజన్యంతో మందులు అందజేయడం పట్ల స్థానిక శాసన సభ్యుడు పత్సమట్ల ధర్మరాజు అభినందనలు తెలిపారు. ఆదివారం స్థానిక పాతూరి కల్యాణ మండపంలో సుమారు 70 మంది చిన్నారులకు మూడు నెలలు సరిపడా మందులు అందించారు. ఎమ్మెల్యే ధర్మరాజుతో పాటు సర్పంచ్ బండారు సింధు,మండల టీడీపీ నాయకులు పాతూరి విజయకుమార్, కొండ్రెడ్డి శ్రీనివాసరావు, పాతూరి వంశీ కృష్ణ, తీడ కృష్ణ మోహన్, యడ్లపల్లి వెంకట్రావు, పత్తిపాటి పెద సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. పూజా టికెట్ల విక్రయాలతో రూ.31,730లు, ప్రసాదాల విక్రయంతో రూ.27,375లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.1885లు ఆదాయం లభించిందని, ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.9,452లు విరాళాలు అందించారని వివరించారు.

సాయి మందిరంలో 30 వేల దీపారాధన

దెందులూరు: దెందులూరు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సాయి మందిరం 25వ వార్షికోత్సవం, దత్తాత్రేయ జయంతి సందర్భంగా 30 వేల దీపారాధన కార్యక్రమం ఆలయ ప్రెసిడెంట్ ఎం. అంజలి, ఆలయ నిర్వాహకులు వీరమాచనేని రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు సాయినామం స్మరిస్తూ 30 వేల దీపాలను సాయి మందిరం చుట్టూ శివలింగం, ఓంకారం తదితర ఆకృతుల్లో వెలిగించారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: పశ్చిమ అటవీ ప్రాంతంలో వేంచేసిన శ్రీ గుబ్బల మంగమ్మవారిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఏజెన్సీకి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పోలవరం: మండలంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పోలవరం బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ్ నగర్ సాయిబాబా ఆలయం, ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం దత్తాత్రేయుడి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

సేవ్ ద గర్ల్..

పాలకొల్లులో ఉత్సాహంగా 2కే రన్



పాలకొల్లులో 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు



పాలకొల్లులో 2కె రన్ సందర్భంగా వేదికపై మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి తదితరులు





అలరించిన నృత్య ప్రదర్శనలు.. విన్యాసాలు

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో ఆదివారం ఉదయం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆధ్వ ర్యంలో 2కె రన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం మంత్రులు వంగల పూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, జిల్లా కలెక్టర్ నాగరాణిలు జెండా ఊపి 2కె రన్ ప్రారంభిం చారు. గాంధీ బొమ్మల సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా యడ్లబజారు, బస్టాండ్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మల సెంటర్‌కు ర్యాలీ చేరు కుంది. ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు సేవ్ ద గర్ల్ చైల్డ్ అంటూ నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు ప్రదర్శ రిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. గాయని మధు ప్రియ, సీరియల్ నటి దీపిక,చిన్నారి వాగ్దేవి పాటలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీ వేద, కూటమి నాయకులు జీవి, విజయభాస్కర్, శేఖర్, అప్పారావు, గాంధీ భగవాన్ రాజు, కర్నేన గౌరు నాయుడు, రోజా రమణి, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, కపర్ధి, బోణం చినబాబు, పద్మా రావు, సమన్వయ కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవిస్తేనే మనుగడ
హోం మంత్రి వంగలపూడి అనిత

జగతికి జన్మనిచ్చిన మహిళలను గౌరవిస్తేనే జాతికి మనుగడ ఉంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించాలన్న సంకల్పం మన ఇంటినుంచే ప్రారంభం కావాలన్నారు. ప్రజా సేవకే అంకితన మంత్రి నిమ్మల రామానాయుడు విజయం వెనుక ఆయన భార్య సూర్యకుమారి ఉన్నారని అభినందించారు. సేవ్‌దగర్ల్ చైల్డ్ కార్యక్రమం క్రమం తప్పకుండా ప్రతీ రెండేళ్లకు ఒకసారి నిర్వహించడం అభినందనీయమన్నారు.

సంక్రాంతి సెలవులపై పునరాలోచించాలి



మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగుప్రజలకు పెద్దపండుగైన సంక్రాంతి సెలవుల్లోనూ పదో తరగతి సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిం దేనంటూ వందరోజుల కార్యాచరణలో ఆదేశించడంపై ప్రభుత్వం పునరాలోచన చేసి సడలింపు చేయాలని ఉభయ గోదావరిజిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సంబంధించి శాసన మండలిలో ప్రస్తావించే వివిధ సమస్యలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలపై విసుగుచెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషిచేయడంతో పాటు, కొత్త ప్రభుత్వంలో పెండింగ్ సమస్యలు పరిష్కార మవుతాయని ఆశించారన్నారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం కొలువుతీరి ఆరునెలలు గడిచినా ఇంతవరకు మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించలేదని, వీటితో పాటు పలు సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతుల పేరుతో స్థానచలనం కలిగించడం వేధించడమేనని ఆరోపించారు. మండలాల్లో ఎంపిక చేసిన జడ్పీ హైస్కూళ్లలోనే ఇంటర్‌విద్యను అందించేందుకు మూడేళ్లక్రితం ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లను కొత్త ప్రభుత్వం ఎత్తివేయనునట్టు సంకేతాలు వస్తున్నాయని పూర్తిస్థాయి ఫలితాలు రాబట్టకుండానే ఎత్తివేయాలనుకోవడాన్ని పీడీఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి కనీస వేతన స్కేళ్ళ (ఎంటీఎస్)ను వర్తింపజేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ఉత్తర్వులతో ప్రభుత్వ పాఠశాలలు పెద్ద సంఖ్యలో మూతపడ్డాయని, వివాదాస్పదమైన ఆ జీవోను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇపుడు అదే జీవో వాసనలున్న ఉత్తర్వుల సారాంశాన్నే పేర్కొంటూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటే, తెలుగు మాధ్యమాన్నికూడా సమాంతరంగా బోధించేందుకు సెక్షన్లు, టీచరు పోస్టులు మంజూరు చేసినపుడే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఉంటుందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా నాయకులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, రాంబాబు, సుభాషిణి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.







పుట్నాల ఉత్సవానికి ధాన్యం దంచుతున్న ఏసీ శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు, సింగరాయపాలెం ఆలయం వద్ద భక్తుల రద్దీ, స్వామివార్లకు శ్రీచక్రస్నానం

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పుట్నాల ఉత్సవం

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

ముదినేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివార్ల పూజా కార్యక్రమాల్లో భాగంగా పుట్నాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. త్రిశూలేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శ్రీచక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు. ధాన్యాన్ని దంచి పొడిని పొలాల్లో తడిపి సుబ్రహ్మణ్యేశ్వరుడికి సమర్పించి భక్తుల శరీరంపై పూత పెట్టి చక్ర స్నానంలో పాల్గొనే కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివ రమేష్, రాధాకృష్ణ, నాగలక్ష్మి, సోవమ్మ తదితరులు సాంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు గూడూరు రామకృష్ణ శర్మ, వీరభద్రశర్మ, ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పశయ్యాలంకరణ నిర్వహించారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మట్టా ప్రసాద్ దంపతులు, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ దంపతులు పూజలు చేశారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, రంగిశెట్టి గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ వీరభద్రరావు, పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● కలిదిండి: పెదలంకలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. షష్ఠి ఉత్సవాలకు సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులకు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలకు ఈవో శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల్లో నేతల నిర్ణయాలే ఫైనల్

ముదినేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో విచిత్రమైన ధోరణి కనిపించింది. ఎన్నికల వేళ ఓటర్లైన రైతులు హాజరు లేకపోవడంతో నేతల నిర్ణయాలే అంతిమం అయ్యాయి. ముదినేపల్లి మండలంలో సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల పదవులకు నాయకులు ఎంపిక చేసిన అభ్యర్థులు, వారి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించే, బలపర్చే వారు తప్ప ఓటర్లు పాల్గొనలేదు. రైతు సమావేశాలు నిర్వహించి, సంఘాల ప్రాధాన్యం వివరించి పదవుల ఎన్నికకు అధికారులు ఏకాభిప్రాయాన్ని సాధించాలి. పోటీ చేసే అభ్యర్థులు వారికి మద్దతు ఇచ్చే వారు మాత్రమే రావడంతో ఏకాభిప్రాయ సాధన అవసరమే లేకుండా పోయింది. వారం రోజుల క్రితమే ప్రాదేశిక నియోజకవర్గ పదవులకు, సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవులకు ఎన్‌డీఏ నాయకులు, అభ్యర్థులను ఖరారు చేశారు. వైసీపీ ఎన్నికలకు దూరంగా ఉంది. మండలంలోని 134 పదవులు ఏకగ్రీవమయ్యాయి.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు



సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి

ముదినేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన పూరిగా ప్రసిద్ధిగాంచిన వడాలి సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతీ రోజూ ఉదయం తీర్థ బిందె కార్యక్రమం, స్వామివారికి విశేష అర్చన, తిరుప్పావై పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుందని దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జనవరి 8న లక్ష తులసీ పూజ, 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనం, 12న మహిళలకు ముగ్గుల పోటీలు, 13న భోగి పండుగ, 14న మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామోత్సవం కార్యక్రమాలు జరుగుతాయి. ధనుర్మాస ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. గురజ వేణుగోపాలస్వామి దేవస్థానం, ముదినేపల్లి పెదరామాలయంలో కూడ ధనుర్మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

● కైకలూరు: మీసాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి నాడు స్వామి వారు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారు. 11న కూడారై ఉత్సవం, 13న గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయి. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

భవానీల గ్రామోత్సవం

మండవల్లి: గ్రామంలో భవానీ భక్తబృందం అమ్మవారి జ్యోతులతో ఊరేగారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో పండితులు భవానీశంకర్, భరద్వాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారిని అలంకరించి, గురుభవానీలు, భవానీ భక్తబృందం, గ్రామస్తులు జ్యోతులతో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో కాళ్లపాలెం జట్టుకు ప్రథమం

కలిదిండి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో కాళ్లపాలెం వెంకటరత్నం జట్టు ప్రథమ స్థానం సాధించింది. డిసెంబరు 10, 11, 12, 13 తేదీల్లో దిరుసుమర్రులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న కాళ్లపాలెం వెంకటరత్నం జట్టుకు రూ.50 వేలు నగదు షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన కాళ్లపాలెం వెంకటరత్నం జట్టుకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, కాళ్లపాలెం సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారిలు అభినందనలు తెలిపారు.



గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి తదితరులు

నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

నూజివీడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్టీసీ బస్టాండు వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు.

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, శాసనసభ్యులు గౌతు శిరీష, మాజీ శాసనసభ్యులు జోగి రమేష్, గౌడ సంఘ నాయకులు, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివ రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ గౌతులచ్చన్న ఆశయాలు నేటి తరానికి ఆదర్శం అన్నారు. పెత్తందారులకు ధైర్యంగా ఎదురు తిరిగిన గొప్ప నాయకుడు అన్నారు. ఆత్మగౌరవం ఆత్మ అభిమానం కోసం జీవితం త్యాగం చేసిన గొప్ప నాయకుడని, దళితుల పేద, బలహీన వర్గాల కోసమే జీవితం త్యాగం చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. గౌడసంఘ పెద్దలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రూ 1.70 లక్షల బోనస్ పంపిణీ



మర్లపాలెంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షుడు

చాట్రాయి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ అనుబంధ, మర్లపాలెం పాల సహకార సంఘం సభ్యులకు సంఘం అధ్యక్షుడు మందలపు రాఘవరావు రూ 1.71 లక్షలు బోనస్‌ను ఆదివారం పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండవ విడత (ఆగస్టు నుంచి నవంబరు వరకు) 10 శాతం బోనస్ పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు రాఘవరావు వివరించారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



నూజివీడు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధి గొత్తూరు తండా గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. నాటుసారా తయారీకి ఉద్దేశించి నల్లబెల్లాన్ని అమ్మినా, లేక బెల్టు షాపులు నిర్వహించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని



కలిదిండిలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కైకలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు ఆశయాలు మహోన్నతమని, యువత వాటిని ఆచరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరక్టర్ పీజెఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడేందుకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, పోలవరపు లక్ష్మీరాణి, గంగుల శ్రీదేవి, పి.రాధాకృష్ణ, కేవీఎస్ఎం నాయుడు, లక్కిశెట్టి మోహన్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

● కలిదిండి: స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో అమరజీవి అయ్యారన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు వూర శ్రీధర్, పలివెల ప్రకాశరావు, వూర నరసింహారావు, బాబ్జి, చక్కా జగన్, వి.పాండు, గుండ్రాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





ముసునూరులో..

ముసునూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఈవోపీఆర్డీ బసవరాజు అచ్యుత సత్యనారాయణ పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టిశ్రీరాముల పట్టుదల, త్యాగ నిరతిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు టౌన్ : తెలుగువారికి స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్న పొట్టి శ్రీరాములు చిరస్మర ణీయుడని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ప్రతిష్ఠకోసం అమరుడైన ఆయన పేరు తెలుగు జాతి ఉన్నంతవరకు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.తాళం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగమణి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి కొరవడిన ఆదరణ?

ముదినేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో జాతీయ నాయకులు, అమరుల విగ్రహాలు ఏర్పాటుచేసిన వాడవల్లి గ్రామస్థులు ఆదర్శంగా నిలిచారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించేందుకు స్పందించ లేదు. గ్రామంలోని అమరజీవి విగ్రహం వద్ద నివాళులర్పించేందుకు కూడ ముందుకు రాలేదు. గ్రామంలో ఉన్న నాయకులకు కూడా ఆ ధ్యాసే లేకుండాపోయింది. సర్పంచ్ సూదాబత్తుల లక్ష్మీ పద్మావతి, ఆమె భర్త రమణ మాత్రమే అమరజీవి విగ్రహానికి ఒక పూలమాల వేసి నివాళులర్పించారు. విగ్రహాలు పెట్టారే కానీ మహాత్ములను స్మరించడం మాత్రం మరిచారు.

100 మందికి ఉచితంగా టీడీపీ సభ్యత్వ నమోదు



ముసునూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని, టీడీపీ యువతనేత ఉప్పలపాటి గణేష్ అన్నారు. గోపవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉచిత టీడీపీ సభ్యత్వ నమోదును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి ఉచితంగా టీడీపీ సభ్యత్వాన్ని అందచేశారు. యువనేత గణేష్ గత 20 రోజులుగా ఉచిత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, నేటికి సుమారు 1450 మందికి టీడీపీ సభ్యత్వ నమోదు చేశారు.గణేష్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు అందిస్తారన్నారు. టీడీపీ నాయకులు బల్లవరపురెడ్డియ్య, వడ్లపట్ల గణేష్, చిలకంటి శేషు, సాయిల అనిల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.ఆంజనేయులు, కె.వి.వి. సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏలూరు జడ్పీ కార్యాలయంలో సంఘ కౌన్సిల్ సమావేశం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.యేసురాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పీఆర్టీ యూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, రమణ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సంఘ జిల్లా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఆదివారాలు, సెలవు దినాల్లో సైతం పదో తరగతి పరీక్షార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సర్‌ప్లస్ టీచర్లను పని సర్దుబాటు పేరుతో ప్రతి నెలా పలు పాఠశాలలకు తిప్పడం వల్ల బోధన కుంటుపడు తుందన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ఎండకు ఎండి.. వానకు తడుస్తూ..

పోలీస్ స్టేషన్ వద్ద శిథిలమవుతున్న వాహనాలు

చాట్రాయి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన బైక్‌లు ఆటోలు ఇతర వాహనాలు ఎండకు ఎండి వానకు తడిసి శిథిలం అవుతున్నాయి. ఏడాది క్రితం కొన్ని వాహనాలు వేలం వేశారు. తరువాత వేలం జరగలేదు. వాహనాలు పూర్తిగా పాడవక ముందే వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను రద్దు చేయడంతో వేలం జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది.



